# విభారె తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY





PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 30-08-2024 సంపుటి : 06 సంచిక : 341 పేజీలు : 8 వెల : రూ 3-00

## విశాఖ ఎయిర్ పోర్టుకు చేరుకున్న మంత్రి నారా లోకేష్

విశాఖపట్నం మంత్రి నారా లోకేష్ గురువారం నాడు ప్రత్యేక విమానంలో విజయవాడ నుంచి విశాఖకు చేరుకున్నారు. ఎయిర్ పోర్టు లో మంత్రికి టిడిపి ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కార్యకర్తలు నాయకులతో అయన ఫోటోలు దిగుతూ ముందుకు కదిలారు. విశాఖ ఎయిర్పోర్ట్ నుంచి రోడ్డు మార్గంలో టిడిపి జిల్లా కార్యాలయం ఎన్టీఆర్ భవన్ కు మంత్రి చేరుకున్నారు.

# ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీగా అమరావతి

**అందుకు అనుగుణంగా రాజధాని లోగో రూపకల్పన**
**అమరావతి అంటే దేవతల రాజధాని**
**ఆ దిశగా ప్రణాళికలు రూపొందించాలి**
**రాజధాని పనుల్లో వేగం పెంచాలి**
**ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం చంద్రబాబు ఆదేశం**



అమరావతి,ఆగస్ట్29 :ఏపీ రాజధాని అమరావతిని ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సిటీగా తీర్చిదిద్దాలని.. ఆ దిశగా ప్రణాళికలు రూపొందించాలని సీఎం చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. రాజధాని అమరావతిపై పురపాలక శాఖ మంత్రి నారాయణ, సీఆర్డీఏ అధికారులతో ఆయన గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ గుర్తుకు వచ్చేలా అమరావతి లోగో ఉండాలని.. రాజధాని పేరులో ఆంగ్లంలో మొదటి అక్షరం చివరి అక్షరం కలిసేలా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సిటీ లోగో రూపొందించాలని సూచించారు. 'అమరావతి దేవతల రాజధాని. అలాంటి గొప్ప రాజధాని పట్ల గత ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించింది. ఇప్పుడు రాజధాని పనులు వేగవంతం కావాలి. పనుల విషయంలో ఎక్కడా రాజీ వద్దు.' అని సీఎం అధికారులకు సూచించారు. 90 రోజుల్లో సీఆర్డీఏ కార్యాలయ నిర్మాణం పూర్తి కావాలని నిర్దేశించారు. రాజధాని ప్రాంతంలో త్వరితగతిన జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి చేయాలని అన్నారు. రాజధానిలో ఎటు చూసినా సాంకేతిక సౌలభ్యత ఉట్టిపడాలన్నారు. నాణ్యతలో ఎక్కడా రాజీ పడొద్దని.. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించాలని సూచించారు. రాజధానిలో ప్రభుత్వ భవనాల నిర్మాణం పూర్తి చేయడానికి పట్టే సమయం, పనులు చేపట్టేందుకు టెండర్లు పిలవడం వంటి అంశాలపైనా సమావేశంలో ఆయన సమీక్షించారు. అటు, హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టుపైనా సీఎం చంద్రబాబు సమీక్షించారు. రాజధాని ప్రాంతంలో నివాసం ఉండాలని కోరుకునే వారి కోసం 14 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును రూపొందించామని.. అయితే, 2019లో వైసీపీ హయాంలో దీనికి గ్రహణం పట్టిందన్నారు. ఈ ప్లాట్లన్నీ అప్పట్లో ఒక్క గంటలోనే అమ్ముడు పోయాయని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఈ ప్రాజెక్టును అప్పటి ప్రభుత్వ చర్యలతో కొనుగోలుదారులు వెనక్కి వెళ్లిపోయారని అన్నారు. గత ప్రభుత్వ చర్యల కారణంగా వచ్చిన నష్టాన్ని పూడ్చేలా విధానాలు రూపొందించాలని సీఎం ఆదేశించారు. రాజధాని ప్రాంతంలో జంగిల్ క్లియరెన్స్ పనుల కోసం 190 ప్రొక్లెయిన్లు వినియోగిస్తు న్నామని.. 60 శాతం పనులు పూర్తైనట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మరోవైపు, విశాఖ, విజయవాడల్లో మెట్రో రైలు ప్రాజెక్టు పనులను సైతం త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టును రెండు ఫేజుల్లో చేపడతామని ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి సీఎంకు వివరించారు. అటు, విజయవాడలోనూ రూ.11 వేల కోట్లతో 38 కి.మీ మేర చేపట్టబోయే మెట్రో రైలు నిర్మాణ ప్రాజెక్ట్ పనులను సైతం వేగవంతం చేయాలని సీఎం నిర్దేశిరచారు. సెప్టెంబర్ 15లోగా అమరావతి రైతులకు వార్షిక కౌలు చెల్లిస్తామని ఏపీ మంత్రి నారాయణ తెలిపారు. రాజధాని అమరావతిపై సీఎం సమీక్ష అనంతరం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. అమరావతిలో ఇంకా 3,550 ఎకరాలు సేకరించాల్సి ఉందని అన్నారు. 'హ్యాపీనెస్ట్ ప్రాజెక్టుకు సీఎం క్లియరెన్స్ ఇచ్చారు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు పూర్తి కావాలంటే రూ.900 కోట్లు కావాలి. విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టుల పూర్తికి సీఎం ఆదేశాలిచ్చారు. ట్రాఫిక్ సమస్యలు తగ్గాలంటే మెట్రోల వల్లే సాధ్యం.' అని మంత్రి పేర్కొన్నారు.

## ప్రయాణికులకు శుభవార్త.. 60 ప్రత్యేక రైళ్లను పొడిగించిన దక్షిణ మధ్యరైల్వే..



దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికులకు శుభవార్త చెప్పింది. ప్రస్తుతం వివిధ మార్గాల మధ్య నడుస్తున్న 60 ప్రత్యేక రైళ్లను పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. అక్టోబర్ నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు ఆయా ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగిస్తాయని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. రాబోయే దసరా, దీపావళి, ఛట్‌పూజ నేపథ్యంలో రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆయా రైళ్లను పొడిగిస్తున్నట్లు పేర్కొంది.ప్రత్యేక రైళ్లను ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరింది. పొడిగించిన రైళ్లలోతెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల మధ్య నడిచే రైళ్లు ఉన్నాయి.సికింద్రాబాద్-రామనాథపురం(07695), రామనాథపురం -సికింద్రాబాద్ (07696),కాచిగూడ-మధురై(07191), మధురై -కాచిగూడ (07192),కాచిగూడ-నాగర్‌కోయిల్(07435), నాగర్‌కోయిల్ -కాచిగూడ(07436),సికింద్రాబాద్-కొల్లం(07193),కొల్లం-సికింద్రాబాద్ (07194) డిసెంబర్ వరకు రాకపోకలు సాగిస్తాయ ని తెలిపింది.అలాగే, తిరుపతి-అకోల, అకోల-తిరుపతి, సికింద్రాబాద్-తిరుపతి, తిరుపతి సికింద్రాబాద్, కాకినాడ టౌన్ - లింగంపల్లి, లింగంపల్లి -కాకినాడ టౌన్, కాచిగూడ - తిరుపతి, తిరుపతి-కాచిగూడ, నర్సాపూర్-సికింద్రాబాద్, మచిలీపట్నం-తిరుపతి, సికింద్రాబాద్ ? అగర్తలా, హైదరాబాద్ -జైపూర్, హైదరాబాద- గోరక్‌పూర్, తిరుపతి- షిర్డీ సాయినగర్, సికింద్రాబాద్ -దానాపూర్, సంత్రాగాచి-సికింద్రాబాద్, షాలిమార్ -సికింద్రాబాద్, హజ్రత్ నిజాముద్దీన్ - సికింద్రాబాద్‌తో పాటు ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయని వివరించింది.

## సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు సీరియస్


న్యూఢిల్లీ ఆగస్టు 29, : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. గురువారం ఓటుకు నోటు కేసు విచారణ సందర్భంగా.. కవిత బెయిల్ తీర్పుపై రేవంత్ చేసిన వ్యాఖ్యలను ధర్మాసనం ప్రస్తావించింది. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఒప్పందం కుదరడం వల్లే, కవితకు బెయిల్ వచ్చిందని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. దీన్ని సుప్రీంకోర్టు సీరియస్‌గా తీసుకున్నది.సీఎం హోదాలో ఉన్న వ్యక్తి ఇలాగే మాట్లాడుతాడా అని కోర్టు ప్రశ్నించింది. జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని సుప్రీం బెంచ్.. సీఎం రేవంత్ తీరును తప్పుబట్టింది. సీఎం చేసిన వ్యాఖ్యలు.. ప్రజల మెదళ్లలో అనుమానాలకు తావిస్తుందని ధర్మాసనం పేర్కొన్నది. తమ ఆదేశాలపై విమర్శలు వచ్చినా తామేమీ బాధపడమని, కానీ తాము తమ అంతరాత్మ ప్రకారమే విధులను నిర్వర్తిస్తుంటామని ధర్మాసనం స్పష్టం చేసింది.ముఖ్య మంత్రి బాధ్యతగా ఉండాలి కదా..? ఇలా ఎలా మాట్లాడుతారు..? కోర్టులను రాజకీయాల్లోకి లాగడం ఏంటి..? రాజకీయ నాయకులను సంప్రదించి మేము మేము ఎవరి వ్యాఖ్యలు పట్టించుకోం. మేము మా విధి నిర్వహిస్తాం. మేము ప్రమాణ పూర్వకంగా పని చేస్తాం.



# వైకాపా మునిగిపోయే నావ

**గేట్లు తెరవకుండానే టిడిపిలోకి వలసలు**
**ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వ్యాఖ్య**

విశాఖపట్నం,ఆగస్ట్29 : వైకాపా మునిగిపోయే నావ అని తెదేపా ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. విశాఖపట్నంలో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నివాసంలో గంటా మీడియాతో మాట్లాడారు. పరిస్థితి చూస్తుంటే వైకాపాలో జగన్ తప్ప ఎవరూ మిగిలేట్లు లేరని వ్యాఖ్యానించారు. ఆ పార్టీలో ఈ పరిస్థితికి జగనే కారణమన్నారు. వైకాపా నేతలు తమ పదవులకు రాజీనామా చేసి తెదేపాలో చేరతామంటే స్వాగతిస్తామని గంటా చెప్పారు. ఒకప్పుడు అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ అధినేత చేసిన సవాళ్లు అన్నీ ఇన్నీ కావు. మేము కానీ గేట్లు ఎత్తేస్తే టీడీపీప పూర్తిగా ఖాళీ అవుతుందంటూ సవాళ్లు విసిరేవారు. ఇప్పుడు అదే డైలాగ్‌ను మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జగన్‌కు అప్పజెప్పారు. తాము గేట్లు ఎత్తేస్తే వైసీపీ పూర్తిగా ఖాళీ అవుతుందని గంటా తెలిపారు. ఇవాళ ఇద్దరు ఎంపీలు మోపిదేవి వెంకట రమణ, బీద మస్తాన్ రావులు తమ పదవితో పాటు వైసీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గంటా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో వైసీపీ మునుగుతున్న నావ అని అన్నానని.. అది ఇప్పుడు మునిగిపోయిన నావ అని ఎద్దేవా చేశారు.వైసీపీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు మా పార్టీలోకి రావడానికి వరదలాగా సిద్ధంగా ఉన్నారన్నారు. ఇలా పార్టీలోకి వచ్చిన వారు.. తమ పదవులకు రాజీనామా చేసి రావాలని తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు చెప్పారని గంటా అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావడానికి వచ్చిన వారిని స్వాగతిస్తామని పేర్కొన్నారు. మోపిదేవి వెంకట రమణ, బీదా మస్తాన్, పోతుల సునీత.. తమ పదవులకు రాజీనామా చేశారని.. మిగిలిన ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు కూడా వైసీపీని వీడుతారని గంటా జోస్యం చెప్పారు. ఆ పార్టీలో జగన్ ఒక్కరే మిగులుతారన్నారు. వైసీపీ ఈ దుస్థితికి కారణం ముమ్మాటికి ఆ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డేనని స్పష్టం చేశారు. ఇప్పటికైనా జగన్ మోహన్ రెడ్డి తన వ్యక్తిత్వాన్ని, తీరును మార్చుకో వాలని గంటా హితవు పలికారు. అలా చేస్తే కనీసం వచ్చే ఎన్నికలు నాటికైనా వైసీపీకి ప్రతిపక్ష హోదా వస్తుందన్నారు.కూటమిప్రభుత్వం వచ్చి రెండు నెలలు కాకముందే .రాష్ట్రపతిపాలన పెట్టమ నడం అయ్యారు. జగన్ మానసిక పరి స్థితి బాగోలేదని ఆయన చెల్లెలు షర్మిలచెప్పారనిగంటా పేర్కొన్నారు.



# తగ్గుతున్న గోజాతి

**ప్రతి ఇంటిలో గోమాతకు స్థానం కల్పించాలి**
**గోమాతను దానం చేసే టప్పుడు నామకరణం తప్పనిసరి**
**దేశ సంస్కృతిని కాపాడేందుకు ఏడాదిలోగా 1.75 కోట్ల మంది గురువులు రాక**
**గోదాన కార్యక్రమంలో హిమాలయ గురూజీ పిలుపు**







విభారే న్యూస్. ఆగస్టు 29 కర్నూలు :ప్రతినిధి కాలానుగుణంగా గోజాతి సంతతి పెరగాల్సింది పోయి... నానాటికి తగ్గిపోతుందని.. ఆ దిశగా అడు గులు పడాలంటే ప్రతి ఒక్కరూ విధిగా తమ ఇంటిలో గోవుకు ప్రత్యేక స్థానం కల్పించి.. ఎదుగు దలకు తోడ్పడాలని హిమాలయ గురూజీ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం కర్నూలు నగర సమీపం లోని చిన్నటేకూర్ నందు గల గో శాలలో గోదాన కార్యక్రమం, ప్రత్యేక హోమాలు, పలు పూజా కార్యక్ర మాలు, గురు ది ప్రవచనం జరి గాయి. ఈ కార్యక్రమాలకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత దంపతులు, నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డిలు హాజ రయ్యారు. ముందుగా వారితో గోపూజ చేయించి. హోమాధి కార్యక్రమాలు నిర్వహించి.. ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి ఆశీస్సులు పొన్నారు. అంతకుముందు గురుజి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రకృతి- ధర్మాన్ని నమ్ముకున్న వ్యక్తి ఎవరు అయినా సరే సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందడంతో పాటు మహోన్నతులుగా కీర్తించబడడం జరుగుతుందని తెలిపారు. గోశాలతో పాటు పక్కన విశాలమైన ధ్యాన మందిరం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు గురూజీ వివరించారు. తాను నెలలో వారం రోజులపాటు కర్నూలు పరిసర ప్రాంతాల వారికి అందుబాటులో ఉంటానని వెల్ల డించారు. ఎవరిని ఎలా పూజిం చాలో ఆ విధంగా పూజించినప్పుడే వారి ఆశీస్సులు మీ వెంట ఉంటా యని గుర్తు చేశారు. ఏ ఇంటిలో అయితే నిత్యం గోమాతను పూజిం చ బడుతుందో వారికి లక్ష్మీదేవి కటాక్షం వెన్నంటే ఉ ంటుందన్నారు. ప్రతి గ్రామంలోనూ ఏడాదికి ఒక సారి అయినా యజ్ఞం లు నిర్వహిస్తే అక్కడ పాడిపంటలు కళకళలాడు తాయని స్పష్టం చేశారు. అలా జరగని పక్షంలో భవిష్యత్తు తరాలు ప్రమాద అంచులకు చేరుకుంటా యని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని నివారించేందుకు అందరం సమస్తిగా కృషిచేసి నియంత్రణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందు కోసం 1.75 కోట్ల గురువులు, అఘోరాలు ఏడాదిలో భారత దేశం కాపాడేం దుకు రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రామ రామిరెడ్డి గోశాల ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు రామచంద్రారెడ్డి, సాయి, లలితా పీఠం మేడా సుబ్రహ్మణ్యం స్వామి, భీమ లింగేశ్వర స్వామి ఆలయ సంబంధికులు పూడూరు లక్ష్మిరెడ్డి, వెల్దుర్తి హనుమాన్ జంక్షన్ వ్యవస్థా పకులు రామాంజ నేయులు, గుడ్ మార్నింగ్ ఇండియా ధర్మసంస్థాన్ పుణ్యమార్గ దర్శన్ ఆత్మ, సోకుల సాలి



జీవన సంఘం అధ్యక్షులు గోవిందరాజులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం గురూజీ అన్ని రకాల ఏర్పాట్లతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు దాతలతో గోపూజ చేసి వారిచే గోవులను దానం చేయించారు.

# సంపాదకీయం

శుక్రవారం 30-08-2024

## మమతకు ఎందుకింత అసహనం

బెంగాల్ టైగర్గా, ఫైర్బ్రాండ్గా పాపులారిటీ సంపాదించుకున్న పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన 14 ఏళ్ల పాలనా అనుభవంలో ఇంత వ్యతిరేకత ఎన్నడూ ఎదుర్కోలేదు. కోల్కతాలోని ఆర్జి కార్ మెడికల్ కాలేజీ, ఆస్పత్రిలో ట్రయినీ వైద్య విద్యార్థిని అత్యంత దారుణంగా హత్యాచారానికి గురికావడం, ఈ కేసును పరిష్కరించడంలో అడుగడుగునా కనిపించిన లోపాలు ఆమె ప్రతిష్ఠను మసకబారినట్టు చేస్తున్నాయి. ఈ సంఘటన విషయంలో ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ గాని, పోలీసులు గాని కచ్చితంగా అనుసరించాల్సిన నిబంధనలేవీ పాటించలేదు. జూనియర్ వైద్యురాలి శరీరంపై తీవ్రగాయాలు కనిపిస్తున్నా, దారుణం గా హత్యాచారానికి గురైందని ప్రాథమికంగా తెలుస్తున్నా అవేవీ పరిశీలించకుండా, వాస్తవాలు కప్పిపుచ్చి ఆత్మహత్య వల్లనే చనిపోయిందని మొదట ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించడం, అసహజ మరణంగా నమోదు చేయడం అనుమానాలకు దారి తీశాయి.ఎఫ్ఐఆర్ను నమోదు చేయడంలో కొన్నిగంటల పాటు ఆలస్యం చేయడం, అలాగే తమ కుమార్తె భౌతిక కాయాన్ని చూడడానికి తల్లిదండ్రులను కొన్ని గంటల పాటు అడ్డుకోవడం వివాదాస్పదమైంది.ఈ కేసును చేపట్టడంలో ఆస్పత్రి వర్గాలు, పోలీస్లు సమర్ధంగా నిర్వహించలేకపోయారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగానే ఈ సంఘటనపై మహిళల్లో తీవ్ర ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఒక మహిళా ముఖ్యమంత్రి పాలిస్తున్న రాష్ట్రంలోనే మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్న విమర్శలు వెల్లువెత్తాయి. రీ క్లెయిమ్ ది నైట్ ('రీ క్లెయిమ్ ది నైట్ అంటే అర్ధరాత్రి స్వాతంత్ర్యం మహిళలకు కల్పించాలి') అన్న నినాదంతో ఆందోళన వ్యాపించింది. అయితే బంగ్లాదేశ్లో హసీనా ప్రభుత్వాన్ని తొలగించడానికి ఎలా ఆందోళనలు సాగాయో అదే తరహాలో తన ప్రభుత్వాన్ని పడగొట్టడానికి వామపక్షాలు, ఇతర విపక్షాలు (రామ్బామ్ వర్గాలు) ఆందోళనలను రెచ్చగొడుతున్నాయని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా విరుచుకుపడ్డారు.ఆర్జి కార్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిని ఆగస్టు 15 తెల్లవారు జామున అల్లరి మూకలు ధ్వంసం చేయడానికి బరి తెగించినప్పుడు అక్కడే రక్షణగా ఉన్న పోలీసులు అడ్డుకోలేదు సరికదా కొందరు తమను తాము రక్షించుకోడానికి ఆస్పత్రిలోకి పరుగులు తీయడం అత్యంత వివాదాస్పదమైంది. దాదాపు ఏడు వేల మంది అల్లరి మూకలో తృణమూల్ పార్టీ మద్దతుదారులు ఉండడం దీని వెనుక ముఖ్యమంత్రి ప్రోత్సాహం ఉందన్న అపవాదు వచ్చింది. సాక్షాధారాలను తుడిచిపెట్టడానికే ఈ విధ్వంసం జరిగిందన్న ఆరోపణలు తలెత్తాయి. సుప్రీం ధర్మాసనం కూడా ఇదే అనుమానాన్ని వ్యక్తం చేసింది. పైగా విధ్వంసానికి పాల్పడినవారిలో చాలా మంది రాష్ట్రానికి చెందిన వారు కాదు. కొన్ని వారాల క్రితం చోప్రాలో దంపతులను స్థానిక తృణమూల్ నేత బహిరంగంగా నడిరోడ్డు పైనే చితక బాదుతుంటే బాధితురాలు బాధతో మెలికలు తిరగడం అక్కడి జనం ప్రత్యక్షంగా చూశారు. అలాంటి అల్లరి మూకలే ఎన్నికల సమయంలో హింసాకాండకు పాల్పడ్డారన్నది వాస్తవం.అప్పటి నుంచి ఒక పార్టీ ఆధిపత్యం కలిగిన సమాజంగా రాష్ట్రంపై ముద్రపడింది. అలాంటి దౌర్జన్య మూకలకు రాజకీయ వ్యవస్థ అండగా ఉంటోంది. జూనియర్ డాక్టర్ హత్యాచార నిందితుడు సివిక్ పోలీసు వాలంటీర్. అతనికి ఆస్పత్రిలోకి, ఎమర్జెన్సీ వార్డు లోకి విచ్చలవిడిగా వెళ్లి రాడానికి అడ్డూఆపూ ఉండేది కాదు. ఇలాంటి సివిక్ పోలీస్ వాలంటీర్ల నియామకం కూడా లోపభూయిష్టంగా ఉంటోంది. అభ్యర్థుల అర్హత నిర్ణయించడంలో వ్యక్తిత్వ పరిశీలన గాని, కనీస జవాబుదారీతనం గాని లేకుండా చేశారు. అధికార పార్టీకి విధేయులుగా ఉంటే చాలు. తృణమూల్ కాంగ్రెస్ విధానాల ఫలితమే ఈ సివిక్ పోలీసు వాలంటీర్ వ్యవస్థకు మూలం. దీని ద్వారా కాంట్రాక్టు పద్ధతిన వాలంటీర్లను నియమించడం జరుగుతోంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇక ఏమాత్రం తనను తాను రక్షించుకునే విధానం పాటించడం ఎవరికీ సంతృప్తి కలిగించదు.ఆర్జి కార్ సంఘటనతో ఏర్పడిన రాజకీయ గందర గోళాన్ని నివారించడానికి, తమ పాలనా యంత్రాంగంలో కొనసాగుతున్న లోపాలను పరిష్కరించే పనిని చేపట్టవలసి ఉంటుంది. ఆర్జి కార్ సంఘటన కన్నా ముందు రాష్ట్రంలో మహిళలపై హింసాకాండ సంఘటనలు ఎన్నో జరిగాయి. మహిళలకు రాష్ట్రం లో భద్రత లేకుండా పోయింది. 2012 లో పార్కు స్ట్రీట్లో కదులుతున్న వాహనంలో మహిళపై హత్యాచారం జరిగింది. 2013లో కామ్దునిలో కాలేజీ విద్యార్థినిపై హత్యాచారం జరిగింది. 2014 లో బీర్భూమ్ వద్ద గిరిజన మహిళపై సామూహిక మానభంగం జరిగింది. ఇటీవలనే 2022లో హంసఖలిలో అత్యాచారానికి గురైన టీనేజర్ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటనలన్నీ రాష్ట్ర ప్రభుత్వం తోసిపుచ్చింది తప్ప జవాబుదారీ మరో వైపు బెంగాల్లో బిజెపి ఆధ్వర్యంలో 12 గంటల బంద్లో చెదురుమదురుగా దౌర్జన్య సంఘటనలు చోటు చేసుకున్నాయి. బంద్కు పాక్షిక స్పందన లభించింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు, అధికార తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) బంద్ మద్దతుదారుల మధ్య సంఘర్షణ జరిగింది. ఆ ఘర్షణల్లో అత్యంత ప్రధానమైనది ఉత్తర 24 పరగణాల జిల్లాలోని భట్పారాలో జరిగింది. తమ స్థానిక నాయకుడు ప్రియంగు పాండే కారుపై టిఎంసి గూండాలు అనేక రౌండ్లు కాల్పులు జరిపారని బిజెపి ఆరోపించి, ఆ ఘటనకు సంబంధించినదిగా భావిస్తున్న ఒక వీడియోను సామాజిక మాధ్యమ వేదికల్లో పంచుకున్నది, పాండే గాయపడకుండా తప్పించుకున్నప్పటికీ వాహనం డ్రైవర్కు, ఒక పార్టీ కార్యకర్తకు తలపై తూటా గాయాలు తగిలినట్లు, వారిని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించినట్లు బిజెపి నాయకులు తెలియజేశారు. అయితే, ఆంగ్లో ఇం డియా జ్యూట్ మిల్లు వెలుపల కొందరు వ్యక్తులు ఆ ఇద్దరిని కొట్టారని పోలీసులు చెప్పారు.

# దీక్ష, రావూస్ లో ఘనంగా తెలుగుభాషా, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు.




ఎమ్మిగనూరు ఆగష్టు 29 విభారె న్యూస్..తెలుగు వాడుక భాష కృషి కోసం గిడుగు వారి కృషి అమోఘం.హాకీ మాంత్రికుడు ధ్యాన్ చందు విద్యార్థులకు స్ఫూర్తిదాయకం. పట్టణంలోని రావూస్ కళాశాల,దీక్ష జూనియర్ కళాశాలలో వ్యవహారికభాష ఉద్యమనేత గిడుగు రామ్మూర్తి జయంతిని తెలుగుభాషా దినోత్సవంగా మరియు హాకీ మాంత్రికుడు ధ్యాన్ చందు జయంతిని జాతీయ క్రీడా దినోత్సవం గా ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మొదట గిడుగు రామ్మూర్తి,ధ్యాన్ చందు చిత్రపటాలకు దీక్ష, రావూస్ కళాశాల సీఈఓ తిరుమలరెడ్డి తో పాటు రావూస్ ప్రిన్సిపల్ ఇర్ఫాన్, దీక్ష ప్రిన్సిపల్ మద్దిలేటి, అకాడమిక్ డైరెక్టర్ పవన్, తెలుగు భాషాధ్యాపకులు పాల్ రాజు,అన్నపూర్ణ నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమాలలో తెలుగుభాషను ఉద్దేశించి సీఈఓ తిరుమలరెడ్డి మాట్లాడుతూ తెలుగుబాషను వాడుక భాషలోకి తీసుకురావడంలో గిడుగు రామ్మూర్తి చేసిన భాషా కృషి అమోఘమైనదని ప్రతి ఒక్కరు గిడుగు వారిని స్ఫూర్తిదాయకంగా తీసుకొని తెలుగు భాషను పరిరక్షించడంలో తమ వంతు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. మన తెలుగు భాషను ఎందరో మహానుభావులు కొనియాడారు, శ్రీకృష్ణదేవరాయలు 'దేశభాషలందు తెలుగు లెస్స' అని, సుబ్రహ్మణ్య భారతి సుందర తెలుగు అని ప్రపంచానికి చాటి చెప్పారు.ఇతర భాషలు నేర్చిన తెలుగు భాషను మర్చిపోకూడదని విద్యార్థులకు తెలియజేశారు.అలాగే క్రీడా దినోత్సవం ఉద్దేశించి మాట్లాడుతూ హాకీ మాంత్రికుడు ధ్యాన్ చందు తన క్రీడా ప్రతిభ ద్వారా భారతదేశ ఔన్నత్యం ప్రపంచ దేశాలకు చాటి చెప్పారని కొనియాడారు. అందుకే ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి,క్రీడలు ఆడటం వల్ల శారీరక ఆరోగ్యాన్ని మానసిక ఆనందాన్ని ఉత్సాహాన్ని పోటీ తత్వాన్ని పెంపొందించుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. మన కళాశాలలో చదువుతోపాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఉందని విద్యార్థులకు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు తెలుగుభాష కవిత్వాలు,గేయాల ఆనందోత్సాహంలో మునిగితేలారు. ఈ వేడుకలో రావూస్, దీక్ష కళాశాల తెలుగు అధ్యాపకులు ఎస్.పాలరాజు, అన్నపూర్ణ, సంస్కృత అధ్యాపకులు గోపాలకృష్ణ,హిందీ ఉర్దూ అధ్యాపకులు నూరిల్ల, వ్యాయామ అధ్యాపకులు ధనుంజయ,గోవిందు తో పాటు తదితర అధ్యాపక బృందం విద్యార్థిని, విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# పోలీసులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి...

### జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్.




కర్నూలు జిల్లా ప్రతినిధి ఆగష్టు 29 విభారె న్యూస్.. జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో ఉచిత మెగా మెడికల్ క్యాంపు.పోలీసులకు ఉచిత వైద్యపరీక్షలు.ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ అన్నారు.గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని హెడ్ క్వార్టర్స్ లోని మిని కాన్ఫరెన్స్ హాల్ లో ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని ఉచిత మెడికల్ క్యాంపును ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమమే ముఖ్యమన్నారు. ప్రధానంగా పోలీసు సిబ్బంది ఆరోగ్యం కు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఆరోగ్య సమస్యలుంటే ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్య పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఉచిత మెడికల్ క్యాంపును పోలీసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.వాకింగ్,జాగింగ్ వంటి వాటికి కొంత సమయాన్ని కేటాయించి ఆరోగ్యంగా ఉండాలన్నారు.పోలీసు అధికారులు ,సిబ్బంది ఆరోగ్యంగా ఉంటే వారు తమ విధులను చక్కగా నిర్వహించవచ్చన్నారు. వైద్య శిబిరంలో పోలీసు సిబ్బందికి చికిత్స చేసిన వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం జిల్లా ఎస్పీతో పాటు,డిస్పీలు, సిఐలు,పలువురు పోలీసు సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కర్నూలు మెడికవర్ హాస్పిటల్, క్రౌన్ డెంటల్, శ్రీ బాలా సాయి ఐ హాస్పిటల్ ,లయన్స్ క్లబ్ అసోసియేషన్ డాక్టర్ల ఆధ్వర్యంలో పోలీసులకు బిపి, షుగర్, ఈ సి జి,2డి ఏకో,బి ఎం డి,పి ఎఫ్ టి,బి ఎం ఐ,డెంటల్, హియరింగ్ టెస్ట్, కంటిచూపు పరీక్ష వంటి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా కంటి అద్దాలు కూడా అందజేశారు.మొత్తం సుమారు 200 మందికి పైగా వివిధ అనారోగ్య సమస్యలతో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి డాక్టర్లు తగిన సూచనలు,సలహాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిస్పీలు జె.బాబు ప్రసాద్, కృష్ణ మోహన్,పోలీసు వేల్పేర్ యూనిట్ హాస్పిటల్ డాక్టర్ శ్రీమతి స్రవంతి,పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు, మెడికవర్ హాస్పిటల్ డాక్టర్లు గణేష్ కుమార్ రెడ్డి, మురార్జీ,వినోద్ ఆచారి, సర్వేరెడ్డి, తేజానందన్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, జోష్న,క్రౌన్ డెంటల్ హాస్పిటల్ డాక్టర్ తేజ్ పెర్సీ, శ్రీ బాలా సాయి కంటి వైద్యశాల,లయన్స్ క్లబ్ డాక్టర్లు జయప్రకాష్,రాయపాటి శ్రీనివాస్,రంగనాయకులు, ప్రభాకర్ రావు,ఆర్ ఐలు, ఆర్ ఎస్సైలు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# తెలుగు భాష దినోత్సవం మరియు జాతీయ క్రీడ దినోత్సవం






ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 29 విభారె న్యూస్ :- తెలుగు భాషా దినోత్సవం మరియు జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని నంద్యాల జిల్లా అపుస్మా అధ్యక్షులు టి అమీర్ భాష ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ మండలం పేరాయిపల్లి గ్రామంలో శ్రీ కాశిరెడ్డి నాయనా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ప్రధానోపాధ్యాయుల మహబూబ్ బాషా ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా ఆళ్లగడ్డ మండలం విద్యాధికారి శ్రీమతి శోభా వివేకవతి మరియు రిటైర్డ్ జడ్జి కాశిభట్ల శివప్రసాద్ మరియు వృక్షయజ్ఞం అధ్యక్షులు లావణ్య మరియు కరస్పాండెంట్ న్యాయవాది తిరుపాల్ రెడ్డి పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు శ్రీమతి టి శాంత కుమారి వ్యాయామం ఉపాధ్యాయుడు ఏ శ్రీనివాస్ రెడ్డి తెలుగుతల్లి, తెలుగు వ్యవహారిక ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటానికి, క్రీడాకారుడు హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల అర్పించి జై తెలుగుతల్లి తెలుగు తల్లికి వందనం దేశభాషలందు తెలుగు లెస్స గిడుగు వెంకట రామమూర్తికి జై ధ్యాన్ చంద్ కి జై మాతృభాష తల్లిపాల వంటిది పరాయి భాష డబ్బా పాల వంటిది అంటూ నినాదాలతో విద్యార్థులు ఉపాధ్యాయులు స్ఫూర్తిగా నిలిచారు తెలుగు భాష దినోత్సవం పురస్కరించుకొని పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు శ్రీమతి టి శాంతి కుమారి మరియు జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని శ్రీనివాస్ రెడ్డి కి శాలువా పూలమాల జ్ఞాపకతో పూల మొక్కలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ మండల విద్యాధికారి మాట్లాడుతూ తెలుగు భాష తెలుగు సంస్కృతి తెలుగు సాహిత్యాలను గౌరవించి కాపాడుకోవలసిన బాధ్యత మన అందరిదని అమ్మ భాష తెలుగు భాషను మర్చిపోవడం జన్మనిచ్చిన తల్లిదండ్రులను మరిచినట్టే అన్నారు. చదువుతోపాటు క్రీడలలో కూడా రానించి విద్యార్థులు ఆళ్లగడ్డ ఖ్యాతిని జాతీయ ఖ్యాతిలో స్ఫూర్తిగా నిలవాలన్నారు.

# క్రీడలతోనే ఆరోగ్యం...

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-ఆగస్టు 29 జన విజ్ఞాన వేదిక డోన్ డివిజన్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని డోన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలుమరియు శ్రీ సుధా సీబీఎస్ ఈ పాఠశాలల్లో జరిగినది. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి మాట్లాడుతూ క్రీడలతోనే ప్రతి ఒక్కరికి మంచి ఆరోగ్యం ఉంటుందని,దేశానికి పేరు వస్తుందని అన్నారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ లూడియమ్మ పాఠశాలలో పిల్లలను ఆడించడం,వారికి జిల్లా రాష్ట్రస్థాయిలో పథకాలు సంపాదించి పెట్టడమే గాక, తను కూడా రాష్ట్ర జాతీయస్థాయిలో షాట్ పుట్ పోటీలలో స్వర్ణ, సిల్వర్, రజత పథకాలను సాధిస్తుండడం మన డోన్ పట్టణానికి గర్వకారణంగా ఉంది అన్నారు. అదేవిధంగా శ్రీ సుధా పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న లోహిత్ క్రికెట్లో జాతీయస్థాయి క్రికెట్ కు ఎంపికై వివిధ టోర్నమెంటులలో రాణిస్తూ ఆల్రౌండర్ గా ఎదుగుతుండడం మన నంద్యాల జిల్లాకే గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా వారిని జనవిజ్ఞాన వేదిక డోన్ డివిజన్ వారు ఘనంగా శాలువా మెమెంటోలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రామ నరసప్ప, సుదర్శన్, యూటీఎఫ్ నాయకులు నరసింహుడు, సుబ్బారెడ్డి, బాబు, జనవిజ్ఞాన వేదిక నాయకులు లతీఫ్, సర్వజ్ఞ మూర్తి, రామమూర్తి,నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు




## చదువుతో పాటు క్రీడలలో రాణించాలి.. విద్యాశాఖాధికారి ప్రభాకర్

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూలై 29 డోన్ పట్టణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాతపేట యందు ప్రధానోపాధ్యాయులు పద్మావతమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖాధికారి ప్రభాకర్ తెలుగు భాషా దినోత్సవం మరియు క్రీడా దినోత్సవం సందర్భంగా గిడుగు రామ్మూర్తి మరియు ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు సమర్పించి నివాళు లర్పించినట్లు వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారితో పాటు తెలుగు ఉపాధ్యాయులు రాధ, లీలావతమ్మ, ఆదినారాయణ, దేవేంద్రప్ప, భాను ప్రకాష్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుల లక్ష్మీ ప్రభావతి, హుస్సేన్ భాను మాట్లాడుతూ దేశభాషలందు తెలుగు లెస్స అన్న శ్రీ కృష్ణ దేవరాయలు అన్న మాటలను గుర్తు చేశారు. అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం చేసిన విద్యార్థి విజయ్, పిరమిడ్ చేసిన విద్యార్థులకు అందరు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు గొప్ప తనాన్ని అద్భుతంగా తెలిపారు. అలాగే హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా వారి క్రీడా స్ఫూర్తిని తెలియజేశారు. వారు హాకీ ఆడేటప్పుడు బంతి పాదరసం లాగా జారిపోయి ప్రత్యర్థులకు దొరక్కుండా ఆట ఆడుతారని ఈ సందర్భంగా వారిని కొనియాడారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులను మండల విద్యాశాఖాధికారి ప్రభాకర్ శాలువా కప్పి పూలమాల మరియు మెమొంటోతో సత్కరించారు. అలాగే మండల విద్యాశాఖాధికారి ప్రభాకర్ ని ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు సత్కరించారు.

# పాపం... సత్యపద్మ

ఏలూరు, ఆగస్టు 29, ఎడారి దేశాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు నలిగిపోతున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను ఎరగా చూపి ఎడారి దేశాలకు పంపిస్తున్నారు. కుటుంబ అవసరాల కోసం అక్కడ పని చేసేందుకు సిద్ధపడుతున్నారు. ఇదే అదునుగా దళారులు రంగ ప్రవేశం చేస్తున్నారు. అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసి.. అడ్డగోలు పనులు పెడుతున్నారు. అక్కడ యజమానులు పెట్టే ఇబ్బందులతో ఉండలేక.. స్వగ్రామానికి వచ్చే మార్గం లేక చాలామంది సతమతమవుతున్నారు. ఎడారుల్లో ఒంటెలకు, పశువుల సంరక్షణలో పనికి కుదురుతున్నారు. వేళకు తిండి ఉండదు. కంటి నిండా నిద్ర ఉండదు. ఈ నేపథ్యంలో అనారోగ్యానికి గురై ప్రాణాల మీదకు తెచ్చుకున్న వారు చాలామంది ఉన్నారు. ఇటీవల సోషల్ మీడియాలో వచ్చిన విన్నపాలపై ఏపీ ప్రభుత్వం స్పందించింది. చాలామందిని స్వస్థలాలకు తీసుకొచ్చింది. ఇటువంటి తరుణంలో మస్కట్లో ఆపసోపాలు పడిన ఓ మహిళ.. అతి కష్టం మీద స్వగ్రామానికి చేరుకునే ప్రయత్నం చేసింది. మస్కట్ నుంచి హైదరాబాద్ వచ్చింది. అక్కడ నుంచి ఆర్టీసీ బస్సులో వస్తుండగా గుండెపోటుకు గురై మృతి చెందింది. ఆ కుటుంబంలో అంతులేని విషాదాన్ని నింపింది. నిరుపేద కుటుంబం కావడంతో భర్త సంపాదన ఒక్కటే సరిపోదని భావించి మస్కట్ వెళ్ళింది. అక్కడ అనారోగ్యానికి గురైంది. తిరుగు ప్రయాణంలో విగత జీవిగా మారింది. తూర్పుగోదావరి జిల్లా కోరుమామిడికి చెందిన బొంత సత్యపద్మకు పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం మంచిలికి చెందిన ప్రభాకర్ తో 15 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే ప్రభాకర్ తెచ్చిన కూలీ సొమ్ము ఇల్లు గడవడానికి కూడా సరిపోవడం లేదు. దీంతో సత్య పద్మ విజయవాడకు చెందిన మహిళ ఏజెంట్ ను ఆశ్రయించింది. రెండేళ్ల కిందట రెండు లక్షల రూపాయలు చెల్లించి మస్కట్ వెళ్ళింది. అక్కడ ఓ ఇంట్లో పనికి కుదిరింది.

కానీ ఆ ఇంటి యజమానుల నుంచి ఇబ్బందులను ఎదుర్కొంది. అనారోగ్యానికి గురైంది. ఇంటికి వెళ్ళిపోతానని గత ఆరు నెలలుగా కోరుతూ వచ్చింది. ఆమెను వెనక్కి పంపాలని భర్త కూడా ఎన్నోసార్లు ఏజెంట్ను కోరాడు. మరో రెండు లక్షల రూపాయలు చెల్లిస్తే కానీ పంపించమని చెప్పడంతో.. ఆ నగదును కూడా కట్టారు. మరో వారం రోజుల్లో తిరిగి వస్తుందనుకుంటే.. విగత జీవిగా తిరిగి రావడాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు.ఏజెంట్ డిమాండ్ మేరకు రెండు లక్షల రూపాయల నగదు కట్టారు. ఈనెల 30న ఆమెను పంపిస్తామని ఏజెంట్ బదులిచ్చారు. కానీ ఉన్నపలంగా ఆమెను పంపించేశారు. కనీసం సమాచారం ఇవ్వలేదు. అనారోగ్యానికి గురైనందునే పంపించేశారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈనెల 24న మస్కట్ నుంచి సత్య పద్మ హైదరాబాద్ వచ్చేశారు. అక్కడ నుంచి తణుకు కు ఆర్టీసీ బస్సు ఎక్కారు. మార్గమధ్యలో ఆమె గుండెపోటుకు గురయ్యారు. ప్రాణాలు వదిలారు. దీంతో విజయవాడ వచ్చిన తరువాత.. అదే రోజు సాయంత్రానికి ఆర్టీసీ అధికారులు ఫోన్ చేసి ఆమె చనిపోయినట్లు తెలిపారు.సత్య పద్మకు గత ఆరు నెలలుగా ఆరోగ్యం బాగోలేదు. ఇంటికి వెళ్ళిపోతానని ఆమె ప్రాధేయపడ్డారు. కానీ అక్కడ యజమానులు అంగీకరించలేదు. విజయవాడలోని మహిళా ఏజెంట్లు సంప్రదిస్తే ఆమె పెద్దగా పట్టించుకోలేదు. ఉన్నపలంగా ఆమెను తేవాలంటే డబ్బులు కట్టాల్సి ఉంటుందని ఆమె హెచ్చరించారు. అయితే తనకు ఆరోగ్యం క్షీణిస్తోందని సత్య పద్మ భర్తకు ఫోన్లో సమాచారం అందించింది. దీంతో ఆయన రెండు లక్షల రూపాయల అప్పుచేసి ఏజెంట్ కు కట్టారు. అయినా సరే భార్య విగత జీవిగా రావడానికి ప్రభాకర్ తట్టుకోలేకపోతున్నాడు. తల్లి మరణంతో ఇద్దరు పిల్లలు దిక్కులేని వారు అయ్యారు.ఎడారి బతుకుల్లో ఎంతోమంది మహిళలు చిక్కుకుంటున్నట్లు తెలుస్తోంది. రకరకాల ఉపాధి పనులని చెప్పి ఎడారి దేశాల్లో వ్యభిచారం చేయిస్తున్న వారు కూడా ఉన్నారు. ఇళ్లల్లో పనులకు వెళ్లే వారికి లైంగిక వేధింపులు ఎదురవుతుంటాయి. అయితే పేదరికంతో అలమటించేవారు.. ఉపాధి పొంది నాలుగు డబ్బులు వెనకేసుకుంటామని విదేశాలకు వెళుతున్నారు. కానీ అక్కడ అనారోగ్య సమస్యలతో విషాదాంతంతో తనువు చాలిస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో కొన్ని వేల మంది తెలుగు మహిళలు ఉపాధి, ఉద్యోగాలు చేస్తున్నారు. వారిలో కొద్దిమంది మాత్రమే సవ్యంగా ఉపాధి పొందగలుగుతున్నారు. మిగతావారు ఇబ్బందుల మధ్య పని చేస్తున్నారు.

# దారి వెతుక్కుంటున్న రాజ్యసభ సభ్యులు

విజయవాడ,ఆగస్టు 29, రాజ్యసభ సభ్యులు వైసీపీకి గుడ్ బై చెప్పనున్నారా? టిడిపిలో చేరనున్నారా? మరికొందరు బిజెపి వైపు మొగ్గు చూపుతున్నారా? ముహూర్తం ఫిక్స్ చేసుకున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. వైసీపీకి 11 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. మరో నలుగురు పార్లమెంట్ సభ్యులు ఉన్నారు. ఇంకా రాష్ట్రంలో 38 మంది ఎమ్మెల్సీలు ఉన్నారు. 11 మంది ఎమ్మెల్యేలు గెలిచారు. వీరితో రాజకీయం చేయాలని జగన్ చూస్తున్నారు. కానీ జగన్ తో ఉంటే తమ పరిస్థితి ఏంటి అని ఆందోళనతో వారు ఉన్నారు. అందుకే కూటమి వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే ముఖ్యంగా కూటమి రాజ్యసభ సభ్యులపై దృష్టి పెట్టింది. వారిని చేర్చుకునేందుకు పావులు కదుపుతోంది. జగన్ విదేశీ పర్యటనకు వెళ్తున్న సంగతి తెలిసిందే. కుమార్తె పుట్టినరోజు వేడుకల కోసం ఆయన 25 రోజులపాటు లండన్ వెళ్ళనున్నారు. అదే సమయంలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు ఉంటాయని టాక్ నడుస్తోంది. అందులో భాగంగా ఆరుగురు రాజ్యసభ సభ్యులు టిడిపిలోకి జంప్ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ విషయం జగన్ కు తెలుసు. వారిని నియంత్రించేందుకు ప్రయత్నించినా.. వారు పెద్దగా ఆసక్తి చూపనట్లు సమాచారం. అందుకే ఏం జరిగితే అది జరుగుతుంది అని జగన్ సైతం సైలెంట్ అయినట్లు తెలుస్తోంది. అయితే టిడిపిలోకి ఎవరెవరు చేరుతారా అన్న చర్చ అయితే బలంగా నడుస్తోంది.వైసీపీకి రాజ్యసభ సభ్యులుగా వై వి సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి వంటి నమ్మకస్తులు ఉన్నారు. అటువంటి వారంతా జగన్ ను విడిచి పెట్టే అవకాశం లేదు. వారి మీద టిడిపి పెద్దగా దృష్టి పెట్టడం లేదు కూడా. అయితే ప్రధానంగా వినిపిస్తున్న పేరు మాత్రం మోపిదేవి వెంకటరమణ. ఎన్నికల ముందు నుంచే ఆయన అసంతృప్తితో ఉన్నారు. ఎన్నికల్లో ఆయన పేరును పెద్దగా పరిగణలోకి తీసుకోలేదు జగన్. ఆయన ప్రత్యర్థికి టికెట్ ఇచ్చి ప్రోత్సహించారు. అందుకే ఆయన తప్పకుండా టిడిపిలో చేరతారని ప్రచారం సాగుతోంది.జగన్ మూలంగానే మోపిదేవి వెంకటరమణ సిబిఐ కేసుల్లో చిక్కుకున్నారు. ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొన్నారు. అందుకే వైసీపీలో మోపిదేవి వెంకటరమణకు జగన్ ప్రాధాన్యం ఇచ్చారు. ఏకంగా తన తొలి క్యాబినెట్లో ఛాన్స్ ఇచ్చారు. తరువాత రాజ్యసభ సభ్యుడిగా ప్రమోట్ చేశారు. ఈ ఎన్నికల్లో అసెంబ్లీ సీట్లు ఆశించారు మోపిదేవి. కానీ రేపల్లెలో వేరే నేతకు టికెట్ ఇచ్చారు జగన్. అప్పటినుంచి మోపిదేవి వెంకటరమణ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. జగన్ కోసం జైలుకు వెళితే తనకు పక్కన పెట్టడాన్ని జీర్ణించుకోలేకపోయారు.అయితే మోపిదేవితో పాటు మరో ఐదుగురు రాజ్యసభ సభ్యులు పార్టీ మారడానికి సిద్ధపడినట్లు తెలుస్తోంది. ఇందులో కొందరు బిజెపిలో చేరుతారని ప్రచారం సాగుతోంది. అయితే టిడిపిలో చేరే రాజ్యసభ సభ్యులతో రాజీనామా చేయించి.. ఉప ఎన్నికలు వస్తే పోటీ చేసి గెలవాలని టిడిపి భావిస్తోంది. తద్వారా వైసీపీని దెబ్బ కొట్టవొచ్చు అని చూస్తోంది. వైసీపీలో ఉన్న రాజ్యసభ సభ్యులు పెద్దగా కంఫర్ట్ గా లేరు. టిడిపి తో ఒప్పందం చేసుకొని వేరే పదవులు తీసుకోవడమో.. రాజ్యసభ సభ్యులుగా మరోసారి అవకాశం దక్కించుకోవడమో చేయనున్నట్లు తెలుస్తోంది. వైసీపీలో ఒకరిద్దరు రాజ్యసభ సభ్యులే మిగులుతారని.. మిగతావారు వైసీపీకి గుడ్ బై చెప్పడం ఖాయమని ప్రచారం సాగుతోంది. జగన్ విదేశాలకు వెళ్తున్న వేళ రాజకీయ పరిణామాలు చోటు చేసుకోవడం ఖాయమని టాక్ నడుస్తోంది.

## నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా నగరంలో 5 కే రన్

అనంతపురం ప్రతిరోజు ప్రజలంతా అరగంట పాటు ఆరోగ్యం, ఫిట్నెస్ లేదా ఏదైనా ఒక స్పోర్ట్స్ యాక్టివిటీలో పాల్గొనేలా దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఉదయం నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి నిర్వహించిన 5కే రన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డి.ఎస్.డి.ఓ షఫీ, డిఎంహెచ్ఓ డా. ఈబి.దేవి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ రోజు మేజర్ ధ్యాన్ చంద్ పుట్టినరోజని, ఆయన క్రీడలకు చేసిన కృషిని గుర్తు చేసుకుంటూ ఆగస్టు 29వ తేదీ నేషనల్ స్పోర్ట్స్ డేని జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి 5కే రన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

కాకినాడ జాతీయ క్రీడా దినోత్సవంను పురస్కరించుకుని గురువారం కాకినాడలో పలు కార్యక్రమాలు నిర్వహించారు . రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ ,ఇతర క్రీడా సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో కాకినాడలో మూడు కిలోమీటర్ల మేర ర్యాలీ నిర్వహించారు. వాయిస్: అనంతరం జిల్లా క్రీడా మండలి ప్రాంగణంలో సీనియర్ జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారులకు సత్కారం చేశారు. వివిధ రంగాల్లో రాణించి దేశానికి, రాష్ట్రానికి పేరు తీసుకొచ్చిన క్రీడాకారులను సత్కరించారు .రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ సీఈవో చంద్రు గోవిందరాజు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్ బి శ్రీనివాసకుమార్, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ జి ఎలీషా, కోశాధికారి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## కండలేరు కాలువ లీకేజు.. రాకపోకలకు అంతరాయం

నెల్లూరు,నెల్లూరు జిల్లా సోమశిల వద్ద కండలేరు వరద కాలువ లీకేజ్తో సోమశిల పొదలకూరు మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లీకేజి నీటి తో కల్వర్ట్ కుంగి పోవడంతో ప్రయాణికులు విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సోమశిల నుంచి కండలేరు ప్రాజెక్టు కు 3 వేల క్యూసెక్కులు నీటి వరద కాలువ ద్వారా వదిలారు. ఈ నేపథ్యంలో కాలువ కు భారీ లీకేజ్ కావడంతో ఈ ఘటన చోటు చేసుకునేది. లీకేజీ నీరు రాజుపాలెం సమీపంలో ని పరమానంద స్వామి ఆశ్రమం వద్ద నుంచి పెన్నానది లో కలుస్తున్నాయి. సోమశిల ప్రాజెక్ట్ అధికారులు మరియు ఆర్ అండ్ బి అధికారులు ఇంతవరకు స్పందించలేదు.ఇరిగేషన్ పంపింగ్ స్కీమ్ పూర్తిగా ధ్వంసమై కూలి పరిస్థితుల్లో ఉంది. నీరు వృధాగా పోతుండడం రహదారి ధ్వంసం కావడం పంపు హౌస్ కూలెందుకు సిద్ధంగా ఉండడం పై అధికారుల నిర్లక్ష్యం గత ప్రభుత్వం వైఫల్యం స్పష్టంగా కనబడుతుంది. ఇప్పటికైనా సోమశిల పై దృష్టి సారించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## శ్రీకాళహస్తిలో తెలుగు భాషా దినోత్సవం వేడుకలు

తెలుగు భాష దినోత్సవం పురస్కరించుకొని శ్రీకాళహస్తిలోని సరస్వతి బాయి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం వేడుకలు ఘనంగా జరిపారు. తెలుగు భాష కనపడాలి, తెలుగు భాష వినపడాలి అంటూ విద్యార్థులు నినాదించారు.

ఆధునిక పోకడల్లో కనుమరుగవుతున్న అమ్మ భాష తెలుగు ను కాపాడుకుందాం తెలుగులోనే మాట్లాడదాం తెలుగులోనే చదువుదామని భాషా పండితులు పిలుపునిచ్చారు.

వాయిస్...తిరుపతి జిల్లా, శ్రీకాళహస్తిలో తెలుగు భాషా దినోత్సవం వేడుకగా జరిగింది.తెలుగు వ్యవహారిక భాష ఉద్యమానికి ఆద్యులు భాష కోవిదులు గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని శ్రీకాళహస్తిలోని సరస్వతి బాయి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం వైభవంగా జరిపారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో విద్యార్థులు తెలుగు తల్లి, గిడుగు రామ్మూర్తి, సాంప్రదాయ వేషధారణలతో చక్కటి తెలుగు భాషా సంస్కృతిని ప్రదర్శిస్తూ వివిధ నాటికలను ప్రదర్శించారు.కోలాటం, భరతనాట్యం నృత్యాలతో చిన్నారులు తెలుగు తేజస్సును గుర్తుచేస్తూ అలరింపజేశారు.పాఠశాల తెలుగు పండితులు మాట్లాడుతూ..విశిష్టమైన తెలుగు భాష కాపాడుకోవాల్సిన అవసరం భావితరాలపై ఉందన్నారు. మాతృభాష ను మర్చిపోతూ ఆంగ్ల భాష పై మక్కువ తగదన్నారు.

## శ్రీవారి సేవలో పలువురు ప్రముఖులు

తిరుమల తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించు కున్నారు. తెలంగాణ ఎమ్మెల్యే ఎం రంగారెడ్డి, తెలంగాణ ఎమ్మెల్యే సత్యనారాయణ రావు, లగడపాటి రాజగోపాల్, తమిళనాడు లేబర్ మినిస్టర్ సీవీ గణేషన్ దర్శించు కున్నారు. రాత్రి తిరుమల వెళ్లి ఇవాళ స్వామి వారికి జరిగే విఐపీల విరామం సమయంలో ఆలయం లోకి వెళ్లి మ్రొక్కులు చెల్లించుకున్నారు.

## నిండుకుండలా శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం శ్రీశైలం జలాశయం నిండు కుండలా మారింది.ఎగువ రాష్ట్రాలలో భారీగా వర్షాలు కురవడంతో జలాశయానికి భారీగా ఇన్ ఫ్లో పెరిగాయి.జలాశయం 7 గేట్లు 10 అడుగుల మేర ఎత్తివేత దిగువన ఉన్న నాగార్జున సాగర్ కు నీటిని విడుదల చేశారు.ప్రస్తుతం ఇన్ ఫ్లో : 2,62,462 క్యూసెక్కులు కాగా ఔట్ ఫ్లో :2,65,233 క్యూసెక్కులు గా ఉంది.డ్యాం పూర్తి స్దాయి నీటి మట్టం 885 అడుగులకు చేరుకుంది.పూర్తిస్థాయి నీటి నిల్వ : 215.8070 టీఎంసీలకు చేరడంతో కుడి,ఎడమ జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది.

## నందిగామలో దొంగల హల్ చల్

నందిగామ ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలో 2వ వార్డ్ లో దొంగలు బీభత్సం సృష్టించారు. తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసిన దొంగలు పట్టణానికి చెందిన గోపు సుధాకర్ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో ఒక శుభకార్యానికి వెళ్లి మరుసటి రోజున తిరిగి వచ్చేన క్రమంలో ఇంటికి తాళాలు పగలగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి దాంట్లో ఉన్న 10 లక్షల ఖరీదైన 175 గ్రాములు బంగారం 25 వేలు నగదును దొంగిలించినట్టు భాదితుడు మీడియాకు తెలిపారు. ఘటనా స్థలం వద్దకు చేరుకున్న ఏసిపి రవికిరణ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు

## రాజమండ్రి నుంచి కలకత్తా కు పాదయాత్ర

కాకినాడ కలకత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన దాడి, హత్యకు వ్యతిరేకంగా మహిళలకు రక్షణ కల్పించాలని రాజమండ్రి నుండి కలకత్తా వరకు ముగ్గురు యువకులు పాదయాత్ర చేపట్టారు. అనంతపూర్ కు చెందిన ఈడిగా ప్రదీప్ కుమార్ ., హైదరాబాద్. కు చెందిన దంత . రాధాకృష్ణ . . టీ తిమ్మాపురానికి చెందిన ఆకేటి బుజ్జి బాబు ఈ యాత్ర చేపట్టారు.ఈ యాత్ర గురువారం కాకినాడ ఇంద్రపాలెం లాకుల వద్దకు చేరుకుంది. వారికి నగర ఎస్ ఎఫ్ ఐ కార్యదర్శి ఎస్ గంగసూరి బాబు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ పాదయాత్ర కలెక్టరేట్ మీదగా కాకినాడని వివిధ ప్రాంతాలు వెళ్లడం జరిగింది.వీరిని కాకినాడ వాసవి క్లబ్ సభ్యులు నాళం ఆండాళ్, కంతేటి లక్ష్మీనారాయణ , సింగంశెట్టి నరేష్, సొల్లేటి నాగ అంబిక,పురం రజిని, మన్యం సుభద్ర తదితర మహిళా ప్రతినిధులు అభినందించారు

# ఐపీఎస్ ల ధిక్కార స్వరం

గుంటూరు, ఆగస్టు 29, వైసిపి హయాంలో కొందరు సీనియర్ ఐపీఎస్ అధికారుల వ్యవహార శైలి వివాదాస్పదంగా మారింది. అప్పట్లో విపక్షాలను టార్గెట్ చేసిన తీరు అభ్యంతరకరంగా ఉండేది. సాధారణంగా ప్రభుత్వానికి అధికారులు అనుకూలంగా వ్యవహరిస్తారు. కానీ గత ఐదేళ్లుగా కొందరు అధికారులు అతిగా ప్రవర్తించారు. ప్రభుత్వ పెద్దల ప్రాపకం కోసం అధికారాన్ని దుర్వినియోగం చేశారు. అటువంటి వివాదాస్పద ఐపిఎస్ అధికారులకు చంద్రబాబు సర్కార్ పోస్టింగులు ఇవ్వకుండా వెయిటింగ్ లో ఉంచింది. వీరు సాధారణంగా డీజీపీ కార్యాలయంలో ఎటువంటి విధులు లేకుండా ఉంటారు. వస్తే కార్యాలయానికి వస్తారు.. లేకపోయినా అభ్యంతరం ఉండేది కాదు. అయితే ఇలా వెయిటింగ్ లో ఉన్న ఐపీఎస్ అధికారులు బెంగళూరు వెళ్లి జగన్ ను కలిశారు. ఇది కూటమి ప్రభుత్వం ఆగ్రహానికి కారణమైంది. అందుకే రెగ్యులర్ గా డిజిపి కార్యాలయానికి వెళ్లి వెయిటింగ్ లో ఉన్న అధికారులు హాజరు నమోదు వేయాలని డీజీపీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీనిపై పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. తెలంగాణకు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి ఒకరు బాహటంగానే వ్యాఖ్యానించారు. ఇది రాజకీయ కక్షపూరిత చర్యగా అభివర్ణించారు. అయితే గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఎంతోమంది ఐపీఎస్ అధికారులను వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టిందని.. కొంతమంది అధికారులు రాజకీయ నేతలుగా మారారని.. అప్పుడు ఎందుకు మాట్లాడలేదని టిడిపి నేతలు ప్రశ్నించడంతో.. వివాదాస్పద అంశంగా మారింది. అయితే డిజిపి కార్యాలయానికి వెళ్లి హాజరు నమోదు చేసే ప్రక్రియను కొందరు అధికారులు విస్మరిస్తున్నట్లు తెలుస్తోంది. పూర్తిగా పట్టించుకోవడం లేదని సమాచారం. దీనిపై తదుపరి యాక్షన్ కు ప్రభుత్వం దిగే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెద్ద ఎత్తున బదిలీ ప్రక్రియ చేపట్టింది. 16 మంది అధికారులకు పోస్టింగులు దక్కలేదు. గతంలో మాదిరిగా వదిలేద్దామని కూటమి ప్రభుత్వం భావించింది. అయితే మధ్యలో జగన్ ను కలిశారన్న వార్తల నేపథ్యంలో రోజు డిజిపి కార్యాలయానికి వచ్చి.. హాజరు నమోదు చేసి.. సాయంత్రం వరకు ఉండాలని ఆదేశాలు ఇచ్చింది.అయితే ఇప్పటికే తెగింపునకు వచ్చిన సదరు వైసిపి అస్మదీయ అధికారులు ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. డిజిపి ఆదేశాలను కూడా వీరు లెక్కచేయని పరిస్థితి ఉండడంతో.. వీరి విషయంలో ఏం చేయాలో అని ప్రభుత్వం ఆలోచిస్తోంది. కచ్చితంగా సీరియస్ యాక్షన్కు దిగితే గానీ వీరు లైన్ లోకి రారని భావిస్తోంది. అందుకు మార్గాలను అన్వేషిస్తోంది. అయితే జగన్ ఆదేశాలతోనే వీరు అలా చేస్తున్నారని అనుమానిస్తోంది.డిజిపి ఆదేశాలను ధిక్కరించిన వారిలో ఐపీఎస్ లు సీతారామాంజనేయులు, పివి సునీల్ కుమార్, విశాల్ గున్ని, కేకేఎన్ అన్బురాజన్,తిరుమలేశ్వర్ రెడ్డి,సిద్ధార్థ కౌశల్,మేరీ ప్రశాంతి, జి ఆర్ రాధిక తదితరులు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే చాలామంది ఐపీఎస్ లు సెలవు పై ఉన్నారు. మిగతా వారు మాత్రం డిజిపి ఆఫీసు వైపు చూసేందుకు కూడా ఇష్టపడడం లేదని తెలుస్తోంది. దీంతో వీరందరిపై ఎలాంటి చర్యలకు ఉపక్రమించాలో ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.అయితే వైసిపి హయాంలో విపరీతంగా రెచ్చిపోయిన అధికారులకు జగన్ భరోసా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే చాలామంది అధికారులు వీఆర్ఎస్ తీసుకున్నారు.ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమిస్తే తక్కువ సర్వీసు ఉన్న అధికారులు విఆర్ఎస్ తీసుకునేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అందుకే ఒక నిర్ణయానికి వచ్చి డిజిపి ఆదేశాలను ధిక్కరిస్తున్నట్లు సమాచారం. మరి కూటమి ప్రభుత్వం వీరి విషయంలో ఎలా ముందుకెళ్తుందో నన్న చర్చ పోలీస్ శాఖలో బలంగా నడుస్తోంది.

# సొంత గూటికి చేరుకున్న మాజీ ఎంపిటిసి

### తెదేపా కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించిన మంత్రాలయం తెదేపా ఇన్చార్జి రాఘువేంద్ర రెడ్డి సీనియర్ నాయకులు చూడి ఉలిగయ్య .

కౌతాళంవైసిపి నాయకులు చౌదరి బసవ పార్టీ వీడి సైకిల్ బాట పట్టారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి బాటలో నడిపించాలంటే అనుభవం ఉన్న నాయకుడు, దేశ రాజకీయాల్లో కీలక నేతగా అంటూ ఎన్నో సార్లు రాష్ట్రపతి ఎన్నికకు కృషి చేసి కూటమి పార్టీ లో అగ్రనేతగా,అటు అభివృద్ధి , ఇటు సంక్షేమము అందిస్తూ ఉన్న మహానాయకుడు చంద్రబాబు నాయుడు అందుకే చంద్రన్న పాలనకు విముగ్ధుడునై పార్టీలో చేరనినీ తెలియజేశారు.గత 5 సం" ములో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని,అభివృద్ధి గాలికొదిలేశారని,ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని,ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టేవారని అందుకే వైసిపి ప్రభుత్వనికి ప్రతిపక్ష హోదా లేకుండా ఆంధ్ర రాష్ట్ర ప్రజలు తీర్పు ఇచ్చారని అన్నారు.మండల నాయకులు వెంకటపతి రాజు,రామలింగన్న,సతీష్ నాయుడు,సురేష్ నాయుడు,రాకేశ్రెడ్డి, కురువ వీరేష్,రాజానందా,నీలకంఠ రెడ్డి ముకాన్న, జనసేన రామాంజినేయులు,గుండప్ప,లక్కే గోవిందు,మలపల్లి లక్ష్మయ్య మల్లయ్య,మారెప్ప అన్న,కాత్రికి చంద్ర,ఈరన్న వీరు గిరి,పంప, కురువ లింగారెడ్డి,నాగ,ఉషేని,నభీ, భాపురం హాజీ, ఏసుభూ,గురులింగా,ఎశాన్న, వెంకోబా వీరికి కౌతాళం తెదేపా కార్యాలయం నందు తెదేపా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమములో గ్రామ నాయకులు కౌతాళం తెలుగు యువత పెద్ద ఏత్తున పాల్గొన్నారు.

# వైభవంగా స్వర్ణరథోత్సవం

శ్రీశైలం,ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం శ్రీస్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించబడింది. శ్రీశైల జగద్గురు పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామివారు ఈ స్వర్ణరథోత్సవానికి విచ్చేశారు.వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు, నెల్లూరు వారు ఈ స్వర్ణరథాన్ని దేవస్థానానికి విరాళంగా సమర్పించారు. ఈనాటి రథోత్సవానికి కూడా దాత శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, శాసనసభ్యులు, కొవ్వూరు, నెల్లూరు జిల్లా వారు రావడం జరిగింది. కాగా ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకొని గురువారం రోజు వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. స్వర్ణరథోత్సవంలో ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణాని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి. అనంతరం ఉదయం గం.7.30లకు ఈ స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. ఆలయమహాద్వారం ముందుభాగం నుంచి ఆలయ నాలుగు మాడవీధులగుండా ఈ రథోత్సవాన్ని జరిపించడం జరిగింది.సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో కోలాటం, చెక్కభజన మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. ఈనాటి స్వర్ణరథోత్సవంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ డి.పెద్దిరాజు దంపతులు, అర్చకస్వాములు, వేదపండితులు, పలువిభాగాల అధికారులు, పర్యవేక్షకులు, తదితర సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు. అదేవిధంగా నాలుగు మాడవీధులలో కూడా అధికసంఖ్యలో భక్తులు రథోత్సవాన్ని తిలకించారు.

## శ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థాన రాజ గోపుర నిర్మాణానికి భక్తుల విరాళం..



కౌతాళం. ఆగష్టు 29 విభారె న్యూస్..శ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థాన రాజగోపుర నిర్మాణం కొరకు కర్నూల్ వాస్తవ్యులైన యాడికి శ్రీకాంత్ గుప్తా, వై. రమ, కుటుంబ సభ్యులు వారు ?.1,94,000/ – చెక్కు రూపంలో విరాళంగా చెల్లించియున్నారు. అధికారులు దాతలకు శ్రీ స్వామి దర్శనం, స్వామివారి శేష వస్త్రము, లడ్డూ ప్రసాదాలు,ఆశీర్వాదాలు కల్పించి,బాండు పేపర్, పూలమాలతో సత్కరించారు.ఈ కార్యక్రమం లో అర్చకులు ఈరన్న స్వామి, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## కర్నూలు జిల్లాకు సీఎం చంద్రబాబు రాక...



కర్నూలు జిల్లా ప్రతినిధి ఆగష్టు 29 విభారె న్యూస్..సీఎం చంద్రబాబు నాయుడు ఈ నెల 31న కర్నూలు జిల్లాకు రానున్నారు. పత్తికొండ మండలం పుచ్చకాయలమడ గ్రామంలో పింఛన్ల పంపిణీలో సీఎం పాల్గొంటారు. సీఎం పర్యటన నేపథ్యంలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, ఆర్డీవో రామలక్ష్మి, డీఎస్పీ వెంకటరామయ్య గ్రామంలో స్థలాన్ని పరిశీలించారు. సెప్టెంబరు 1న సెలవు నేపథ్యంలో ఒకరోజు ముందుగానే 31న పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే.

## భాష్యం స్కూల్లో ఘనంగా నేషనల్ స్పోర్ట్స్ డే, తెలుగు భాషా దినోత్సవ వేడుకలు..




ఎమ్మిగనూరు ఆగష్టు 29 విభారె న్యూస్.. పట్టణంలోని భాష్యం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో జాతీయ క్రీడా దినోత్సవం,తెలుగు భాషా దినోత్సవ వేడుకలను సీఈఓ అనిల్ కుమార్ ఆదేశాలతో గురువారం ప్రిన్సిపాల్ మాచాని కవిత ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థిని విద్యార్థులకు,కోకో,కబడ్డీ, త్రో బాల్,నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు.ప్రిన్సిపాల్ మాచాని కవిత మాట్లాడుతూ చదువుతోపాటు పిల్లలు శారీరకంగా,మానసికంగా ఎదుగుదలలో క్రీడలు అత్యంత ప్రముఖ్యమైనవి అన్నారు.భాష్యం యాజమాన్యం ఇటువంటి క్రీడలను నిర్వహించడంలో, సమస్త ముందుగా ఉంటుందని చెప్పారు.ఈ సంవత్సరము నుండి భాష్యం ప్రీమియర్ లీగ్ పోటీలను నిర్వహిస్తున్నారని తెలియజేశారు.అలాగే తెలుగు భాష దినోత్సవం గురించి మాట్లాడుతూ, అమ్మ ఒడిలో నేర్చుకునే భాష మాతృభాష అని ఎన్ని భాషలు నేర్చుకున్నా తల్లిలాంటి మాతృభాషను మరువకూడదన్నారు. మాతృభాష మమకారాన్ని చాటారు, తెలుగు భాష దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థిని విద్యార్థులకు పద్యాల పోటీలను, క్విజ్ పోటీలను నిర్వహించడం జరిగింది. గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు ప్రిన్సిపాల్ బహుమతులను అందచేశారు.ఈ కార్యక్రమంలో చాంప్స్ ఇన్చార్జ్ అనురాధ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపిక లో గత తప్పిదాలు సవరించండి - ఆప్టా



కర్నూలు జిల్లా ప్రతినిధి ఆగష్టు 29 విభారె న్యూస్..ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5 న ఇచ్చే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లలో తక్కువ మంది ఉపాధ్యాయులకే రాష్ట్ర అవార్డు లను ఇచ్చు చున్నారు. కానీ ప్రభుత్వ, జిల్లాపరిషత్ , మున్సిపల్, ఎయిడెడ్, ఏ పి ఆర్ ఈ ఐ ఏస్, ఏ పి ఏస్ డబ్ల్యూ ఆర్ ఈ ఐ ఏస్, ఏ పి టి డబ్ల్యూ ఆర్ ఈ ఐ ఏస్, తదితర విభిన్న మేనేజ్మెంట్ లకు చెందిన ఎక్కువ మంది ఉపాధ్యాయులకు అవార్డులు ఇవ్వ వలసి ఉన్నది. తక్కువ మంది ఉపాధ్యాయులకే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వడము తో వివిధ మేనేజ్మెంట్ లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమని తక్కువ చేస్తున్నట్లు అసహనము గా ఉన్నారు. గతం లో జరిగిన తప్పిదాలు సవరించండి అని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షుడు ఎ జి ఎస్ గణపతి రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్ రావు మానవ వనరుల శాఖ మంత్రి వర్యులు నారా లోకేష్ బాబు కి, విద్యా శాఖ లో ఉన్నత అధికారులకు లేఖ ద్వారా ప్రాతినిథ్యం చేయటం జరిగింది. స్కూల్ అసిస్టెంట్ కేటగిరిలో అనేక సబ్జెక్టు లు , అనేక భాష లు ఉన్నాయి. మ్యాథ్స్, ఫిజిక్స్, బయాలజీ,సోషల్ మొదలైన సబ్జెక్టులు, భాషలలో ఇంగ్లీషు ,తెలుగు, హిందీ, సంస్కృతము, ఉర్దూ, ఒరియా, తమిళం తదితర భాషా స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు.విభిన్న మేనేజ్మెంట్ లకు చెందిన స్కూల్ అసిస్టెంట్లకు అవార్డు లు ఇవ్వ వలసి ఉన్నందున లో ప్రతి సబ్జెక్టు లో, ప్రతి భాష లో స్కూల్ అసిస్టెంట్ లకు అయిదుగురు చొప్పున , సంఖ్య పరంగా అధికంగా వుండే ఎస్ జి టి లకు అధిక సంఖ్య లో దరఖాస్తులు చేసుకున్న వారిలో మండల , జిల్లా స్థాయి లను దాటి రాష్ట్ర స్థాయి కి వచ్చిన వారికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లను ఇచ్చి వారిలో స్ఫూర్తి ని నింప వలసినదిగా తద్వారా వారు మరింత ఆసక్తి తో విద్యార్థులకు పాఠాలు భోధించడానికి సంసిద్దులు అవుతారు.సైన్స్ టీచర్లకు మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సైన్స్ ఫెయిర్ లలో పాల్గొనే అవకాశం ఉంటుంది.అదేవిధముగా మ్యాథ్స్ ఉపాధ్యాయులకు, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో మ్యాథ్స్ ఒలంపియడ్ లలో పాల్గొనే అవకాశం ఉంటుంది. కానీ భాషను బోధించే ఉపాధ్యాయులకు మరియు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఆ స్థాయిలో అవకాశాలు ఉండవు. అధికారులు ఉపయోగించే సూచిక ల ద్వారా వీరికి అన్యాయం జరిగే అవకాశం ఉంది.కావున రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇచ్చేటప్పుడు అన్ని సబ్జెక్టులను కలిపి మెరిట్ లిస్ట్ కాకుండా కాకుండా ఏ సబ్జెక్టు కు ఆ సబ్జెక్టు విడిగా మెరిట్ లిస్ట్ ప్రిపేర్ చేసి తద్వారా అన్ని సబ్జెక్టు ల ఉపాధ్యాయులకు, అన్ని జిల్లాల ఉపాధ్యాయులకు అవార్డుల ఎంపికలో సముచిత స్థానం కల్పించ వలసినదిగా కోరటం జరిగింది.అంతే కాకుండా ఒక సారి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందినవారికి మరల రెండవ సారి ,మూడవ సారి అవార్డులు ఇచ్చి మిగతా వారికి అవకాశం లేకుండా చేస్తూ ఉత్తమ ఉపాధ్యాయ అవ్వార్డుకు ఉన్న ఔన్నత్యాన్ని దిగజరుస్తున్నారు.ఈ విషయం లో శ్రద్ధ చూపి రాష్ట్రం లో ఉపాధ్యాయ లోకం యందు ఆత్మస్థయిర్యం కల్పించమని ఆప్టా రాష్ట్ర నాయకులు కొరటం జరిగింది.ఈ విషయం లో మంత్రి వర్యులు సానుకూలంగా వెంటనే స్పందించినందుకు వారు హర్షం వెలిబుచ్చారు..

# సంతాన ఉత్పత్తి సమస్య మగవారిలోనే అధికం

**రియా సంతాన సాఫల్య కేంద్రం తోనే అధిగమించవచ్చు. రుయా ఆసుపత్రి ప్రారంభించిన మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత రెడ్డి**








విభారే న్యూస్. ఆగస్టు 29. కర్నూల్ ప్రతినిధి ఆధునిక యుగంలో స్త్రీల కంటే మగవారిలోనే సంతానోత్పత్తి సమస్య అధికంగా ఉందని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అభిప్రాయపడ్డారు. గురువారం బిర్లా గేట్ లోని సీఎం హాస్పిటల్ ఆవరణలో డాక్టర్ రాజశేఖర్, శ్రావ్య, మహేష్ తిలక్ లు నూతనం గా ఏర్పాటు చేసిన రియా సంతాన సాఫల్య కేంద్ర ప్రారంభోత్సవానికి టీజీ వెంకటేష్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, వెంకటరెడ్డి దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ వైద్యరంగంలో హైదరాబాద్ తర్వాతి స్థానం కర్నూలుదేనని అభిప్రాయపడ్డారు. కర్నూలు నగరం అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉండటం హర్షించదగ్గ విషయం అన్నారు. వైద్యపరంగా నగరవాసులకు ఎప్పటికప్పుడు సాంకేతికతో కూడిన వైద్య సేవలు అందు బాటులోకి తెచ్చినందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఇటీ వల కాలంలో యువత జీవన విధానంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగానే సంతానో త్పత్తి విషయంలో ఇబ్బందులకు గురవుతున్నారని ఒకింత ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి వారి కలలను నిజం చేసేందుకు సంతాన సాఫల్య కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయని.. అలాంటివారు ఎవ రైనా ఉన్నట్లయితే వైద్యుల సలహా సూచనల మేరకు ఇరువురు వారు సూచనలు తూచా తప్పకుండా పాటించి పిల్లాపాపలతో ఆనందమయ్య జీవితం గడపాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ స్త్రీ వివాహ అనంతరం తన పిల్ల పాపలతో సంతోషకర జీవితాన్ని గడపాలని కోరుకుంటుందని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో ఎక్కువ శాతం ఆలస్య వివాహాలు, ఆహారంలో మార్పులు వంటి కారణంగా తల్లి భాగ్యం పొందే అవకాశాన్ని చేజే తుల దూరం చేసుకుంటున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి దంపతులు ఇరువురు సాఫల్య కేంద్రాలను సందర్శించి వైద్యుల సూచనల మేరకు నిబంధనలు పాటించి పిల్లాపాప లతో ఆనంద జీవితాన్ని పొందాలని సూచించారు. అనంతరం డాక్టర్ శ్రావ్య మాట్లా డుతూ స్త్రీల కంటే పురుషుల్లోనే ఈ సమస్య పెరిగిపోతుందన్నారు. అందుకు ప్రధాన కారణం ఎక్కువ శాతం మంది పురుషులు రాత్రి వేళల్లోనూ విధులు నిర్వహించడం, యుక్త వయసులో వివాహాలు చేసు కోలేకపోవడం, ఆహార విషయంలో వింత పోకడలకు వెళ్లడంతోనే ఈ సమస్య ఉత్పన్నమవుతుందని వివరించారు

# ఎల్ఐసి పరిరక్షణకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలి...

**- ఎల్ఐసి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఏఐఐఈఏ పోరాటం..**



ఎమ్మిగనూరు ఆగష్టు 29 విభారె న్యూస్..ఎల్ఐసి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ పోరాటం చేస్తుందని ఏఐఐఈఏ కడప డివిజన్ నాయకులు సునీయ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఎల్ఐసి కార్యాలయంలో ఎమ్మిగనూరు బ్రాంచ్ ఏఐఐఈఏ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఐఈఏ కడప డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు అక్బర్ బాషా,సహాయ కార్యదర్శి రాజు రమేష్,కార్యవర్గ సభ్యులు సునీయ్ కుమార్ మాట్లాడుతూ ఎల్ఐసి పరిరక్షణ ప్రతి ఉద్యోగి కృష చేయాలని, అలాగే యూనియన్ పరిరక్షణకు కృషి చేయాలి అన్నారు. ఎల్ఐసి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిత్యం పోరాటం చేస్తున్నామన్నారు. అలాగే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యూనియన్ నిరంతరం కృషి చేస్తుంది అన్నారు.ఎమ్మిగనూరు బ్రాంచ్ ఏఐఐఈఏ నూతన కమిటీ ఎంపికఏఐఐఈఏ:బ్రాంచ్ నూతన కమిటీ అధ్యక్షులుగా కే వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా టి రాము, ప్రధాన కార్యదర్శిగా బి విజయ్ కుమార్,సహాయ కార్యదర్శిగా ఐజి రఘునాథ్ గౌడ్ ఆర్థిక కార్యదర్శిగా బ్రహ్మానందరెడ్డి, కమిటీ సభ్యులుగా ఎన్ అంపయ్య,ఎం గోవర్ధన్, ఎన్ పరమేశ్వర్ రెడ్డి,జై మురళీకృష్ణ డి శ్రీ వాణి డివిజన్ కమిటీ సమక్షంలో ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.




# అలరించిన అష్టావధానం...

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూలై 29 తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా డోన్ పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జరిగిన అష్టావధానం అందరిని అలరించినది. ప్రధానోపాధ్యాయులు పద్మావతమ్మ, సీనియర్ ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గంగుల నాగరాజు అష్టావధానం చక్కటి పద్యాలతో, తెలుగు భాషా మాధుర్యము ఉట్టిపడేలా కొనసాగినది. ప్రుపృచ్ఛకులు ఇచ్చిన ప్రశ్నలకు చందోబద్ధంగా, వ్యాకరణ శుద్ధితో పద్యాలను పూరించారు.సర్వజ్ఞ మూర్తి సమన్వయ కర్త గా వ్యవహరించగా,పృచ్ఛకులుగా సురేష్ బాబు, దేవేంద్రప్ప, ఆదినారాయణ, భాను ప్రకాష్ రెడ్డి,రఘునాథ్ ,లీలావతమ్మ, రాధ, సువర్ణ పాల్గొన్నారు. అవధానం అనంతరం అవధాని ని పృచ్ఛకులను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**